# గొప్ప ప్రత్యక్షత

## ప్రకటన గంథ్ర సంగ్రహ సమీక్ష

**A. ఉపోద్ఘాతం :**

ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు మానవాళిలో దాని అంతాన్ని గూర్చిన కలవరాన్ని, భయాన్ని కలిగిస్తున్నాయి. అయితే బైబిలులోని చివరి పుస్తకమైన ప్రకటన గ్రంథాన్ని చదువుతున్నప్పుడు లోక స్థితి గతులు, దాని భవిష్యత్తు అర్థమవడమే కాకుండ, అన్నీ సవ్యంగానే జరుగుతాయన్న నమ్మకాన్ని కలిగిస్తుంది.

ప్రకటన గ్రంథం బైబిలులో 66వ పుస్తకం మరియు చివరి పుస్తకం. దానిని అర్థం చేసికోవాలంటే దానికి ముందున్న 65 పుస్తకాలను గూర్చి తెలిసికొని ఉండాలి. ముఖ్యంగా పాత నిబంధనను అర్థం చేసుకొని ఉండాలి. ఎందుచేతనంటే ప్రకటన గ్రంథంలోని 404 వచనాలలో 278 వచనాలు పాతనిబంధన వచనాలతో సంబంధం కలిగి ఉన్నాయి.

**1. గ్రంథకర్త :** అపొస్తలుడైన యోహాను

**2. గ్రంథ రచన కాలం :** క్రీ॥ శ॥ 95 - 100 మధ్యకాలం

**3. గ్రంథ విశిష్టత :**

అ. ప్రకటన గ్రంథం, ప్రవచన దారులన్నిటిని కలిపే ఒక గొప్ప కూడలి అని చెప్పవచ్చును.

ఆ. ప్రకటన గ్రంథం ఆదికాండమునకు భిన్నమైనది.

ఒక్క మాటలో చెప్పాలంటే ఆదికాండంలో ప్రారంభించబడిన వాటన్నిటి ముగింపు ప్రకటన గ్రంథంలో ఉన్నది.

1. ఆదికాండములో భూమి సృష్టించబడింది. ప్రకటన గ్రంథంలో అది గతించిపోతుంది.
2. ఆదికాండములో సూర్యచంద్ర నక్షత్రాలు భూమిని ఏలినవి. ప్రకటన గ్రంథంలో వాటి వలన భూమికి తీర్పు తీర్చబడుతుంది.
3. ఆదికాండంలో చీకటి, రాత్రి అని పిలువబడింది. ప్రకటనలో రాత్రి లేదు.
4. ఆదికాండంలో జలరాశి సముద్రం అని పిలువబడింది. ప్రకటన గ్రంథంలో సముద్రము ఇక లేదు. (ఆది. 1:10; ప్రక. 21:1).
5. ఆదికాండములో పాపం ప్రవేశించింది, ప్రకటన గ్రంథంలో నిర్గమించింది.
6. ఆదికాండములో శాపము ప్రకటించబడింది. ప్రకటన గ్రంథంలో శాపం తొలగించబడింది. (ఆది 3:17; ప్రక. 22:3).
7. ఆదికాండంలో మరణం ప్రవేశించింది. ప్రకటన గ్రంథంలో మరణమన్నది ఇకలేదు.
8. ఆదికాండంలో దుఃఖం మరియు శ్రమలు ఆరంభమయ్యాయి. ప్రకటన గ్రంథంలో

దుఃఖం లేదు కన్నీళ్ళులేవు. ఈ గ్రంథంలో ఏది ఆరంభించబడలేదు కాని బైబిలులో ఏదో ఒక గ్రంథంలో ఆరంభించబడినవి ఈ గ్రంథంలో ముగించబడ్డాయి. అందుకే దీనిని అర్థం చేసికోవడానికి బైబిలులోని ఇతర పుస్తకాలన్నీ తెలికొని ఉండాలి.

ఇ. **ప్రకటన గ్రంథానికి దానియేలు గ్రంథంతో సంబంధం ఉన్నది :** దానియేలు గ్రంథంలోని ప్రవచనాలన్నీ ఈ గ్రంథంలో నెరవేర్చబడ్డాయి.

1. దానియేలు గ్రంథంలోను, ప్రకటన గ్రంథంలోను నాశనం చేయబడని ఇశ్రాయేలు జాతిని గూర్చి వ్రాయబడింది. (దాని 3,6 అధ్యా; ప్రక 12 అధ్యా).
2. క్రీస్తు విరోధి, వాని పనిని గూర్చి (దాని 3:1-7; 7,8, 24, 25; 8:9-12,23, 24, 25; 9:27; 11:27; 11:36-45 ను ప్రకటన 13వ అధ్యాయంతో పోల్చండి).
3. మహాశ్రమల కాలపరిమితిని గూర్చి దాని 24-27 ను ప్రక. 11:2; 12:6,14; 13:5తో పోల్చండి.

అయితే దానియేలు గ్రంథానికి ముద్రవేయబడింది (దాని 12:9) కాని ప్రకటన గ్రంథానికి ముద్రవేయబడలేదు (ప్రక 22:10).

ఈ. **ప్రకటన గ్రంథంలో 7 మరియు 12 అనే సంఖ్యలు ప్రాముఖ్యమైనవి.**

ఉ. **గ్రంథం యొక్క ధన్యత :** ఈ గ్రంథం చదివిన వారికి ఒక ఆశీర్వాదం వాగ్దానం చేయబడింది (ప్రక 1:3). చివరిలో ఒక హెచ్చరిక ఇవ్వబడింది. (ప్రక 22:18,19).

**4.** **ప్రకటన గ్రంథ వ్యాఖానాలు :** ఈ గ్రంథమును గూర్చి పలు వ్యాఖ్యానాలు లేక వాదములు ఉన్నాయి.

అ. ఇందలి సంఘటనలు పూర్తిగా ఊహించి వ్రాసినవని, వాటి ద్వారా దేవుని ఉనికిని నిరూపించలేమని అసంబద్ధవాదుల ఉద్దేశం.

ఆ. ఈ గ్రంథమంతా అలంకారరూపమైనదని, పుస్తకంలోని ఏ భాగమును కూడ అక్షరార్థంగా తీసుకోలేమని, స్వేచ్ఛావాదుల ఉద్దేశం. మంచి చెడుల మధ్య ఎంతో కాలం నుండి జరుగుతున్న పోరాటానికి చిహ్నముగా చెప్పబడిన సంగతులు ఇందులో ఉన్నాయని వారి వాదము.

ఇ. ప్రకటన గ్రంథం చరిత్రాత్మకమైనదని అందులో రెండు చరిత్రలున్నాయని మరి కొంతమంది వాదన.

**1.** **గత చరిత్ర అనే వాదము :** ప్రకటన గ్రంథమంతా గతంలోనే జరిగిన అనగా యోహాను పేర్కొన్న 7 స్థానిక సంఘాల కాలంలో, నీరో లేక డొమిషియన్ చక్రవర్తుల పాలనలో జరిగిన సంఘటనలని వీరి వాదన. ఆనాడు హింసలలో ఉన్న సంఘము ఓదార్పు కొరకు, వారు అర్థం చేసుకోగల చిహ్నాలతో ఇది వ్రాయబడిందని వారు అంటారు. ఈ వాదము సరైనది కాదని, అది గతానికి సంబంధించినదైతే, ప్రస్తుత కాలానికి అర్థరహితమైనదని, దానిని బైబిలులో చేర్చే అవసరం లేదని మరి కొంతమంది వాదన.

అది భవిష్యత్తుకు సంబంధించినది గనుక బైబిలులో చేర్చబడింది.

2. **కొనసాగుతున్న చరిత్ర :** ఈ వాదము ప్రకారము, ప్రకటన గ్రంథ నెరవేర్పు యోహాను కాలం నుండి నేటి వరకు సంఘ చరిత్రలో క్రమేణ కొనసాగుతూ ఉన్నది. ఇందలి 7 సంఘాల వివరాలను బట్టి ఈ సత్యాన్ని కొంతవరకు అంగీకరించవచ్చును. కాని ప్రకటన గ్రంథం ప్రవచనాత్మకమైనదని స్పష్టమౌతున్నది.

ఈ. **ప్రకటన గ్రంథం చారిత్రక ఆధ్యాత్మిక వ్యాఖ్యానం :** అని కొంత మంది వాదము ఈ సిద్ధాంతం ప్రకారం ప్రకటన గ్రంథం చాల మట్టుకు నెరవేర్చబడింది. అది ఈ కాలం నాటి సంఘానికి అవసరమైన ఆత్మీయ పాఠాలను కలిగి ఉన్నది.

ఉ. **భవిష్యత్తును గూర్చిన గ్రంథం :** ప్రకటన గ్రంథం ప్రప్రథమంగా ప్రవచన గ్రంథం. మహిమాన్వితుడైన క్రీస్తు ప్రత్యక్షతతో ఆరంభించబడింది. తరువాత సంఘ చరిత్ర అంతా ఇవ్వబడింది. మూడవ అధ్యాయం చివరిలో సంఘం ఎత్తబడుతుంది. నాల్గవ అధ్యాయం తరువాత సంఘటనలన్నీ ఇంకా నెరవేర్చబడాలి, ఈ తలంపును సాధారణంగా అందరూ అంగీకరిస్తారు.

## B. ప్రకటన గ్రంథ విభజన :

### I. యేసుక్రీస్తు వ్యక్తిత్వం - మహిమలో క్రీస్తు (1 అధ్యా)

| | | |
|---|---|---|
| 1. | పుస్తకం యొక్క శీర్షిక | 1:1 |
| 2. | ప్రత్యక్షత విధానం | 1:2 |
| 3. | బైబిలు పఠనకైన వైఖరి | 1:3 |
| 4. | గ్రంథకర్త యోహాను నుండి, మరియు పరలోకంలోని క్రీస్తు నుండి శుభాశీస్సులు | 1:4-8 |
| 5. | మానవావతారము అనంతరం, మహిమ శరీరంతో ఉన్న క్రీస్తు సంఘానికి తీర్పు తీర్చుట (అతి పరిశుద్ధ స్థలంలోని గొప్ప ప్రధాన యాజకుడు) | 1:9-18 |
| 6. | ప్రత్యక్షీకరణలోని సంఘటనల సమయ విభజన | 1:19 |
| 7. | ఏడు నక్షత్రములు మరియు ఏడు దీపస్తంభాల వివరణ | 1:20 |

### II. యేసు క్రీస్తు సొత్తు - లోకములో ఉన్న సంఘము (2 అధ్యా)

| | | |
|---|---|---|
| 1. | క్రీస్తు ఎఫెసు సంఘమునకు వ్రాసిన ఉత్తరం | 2:1-7 |
| 2. | స్ముర్న సంఘమునకు వ్రాసిన ఉత్తరం | 2:8-11 |
| 3. | పెర్గము సంఘమునకు వ్రాసిన ఉత్తరం | 2:12-17 |
| 4. | తుయతైర సంఘమునకు వ్రాసిన ఉత్తరం | 2:18-29 |
| 5. | సార్దీస్ సంఘమునకు వ్రాసిన ఉత్తరం | 3:1-6 |
| 6. | ఫిలదెల్ఫియా సంఘమునకు వ్రాసిన ఉత్తరం | 3:7-13 |

| | | |
|---|---|---|
| 7. | లవొదికయ సంఘమునకు వ్రాసిన ఉత్తరం | 3:14-22 |

**III. యేసు క్రీస్తు ప్రణాళిక - పరలోకములోని దృశ్యము (4-22 అధ్యా)**

**A. సంఘము క్రీస్తుతో పరలోకంలో ఉండుట - 4,5 అధ్యా :**

"నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్దనుండుటకు మిమ్మును తీసికొని పోవుదును"

| | | |
|---|---|---|
| 1. | దేవుని సింహాసనం | 4:1-3 |
| 2. | 24గురు పెద్దలు | 4:4,5 |
| 3. | నాలుగు జీవులు | 4:6-11 |
| 4. | ఏడు ముద్రలు వేయబడిన గ్రంథం | 5:1-4 |
| 5. | క్రీస్తు : యూదాగోత్రపు సింహము మరియు వధింపబడిన గొఱ్ఱెపిల్ల | 5:11,12 |
| 6. | పరలోక దూతల సమూహం, స్తుతి మరియు విమోచన గీతము పాడుట | 5:11,12 |
| 7. | సర్వలోకానికి సార్వభౌముడైన రక్షకునికి సార్వత్రిక ఆరాధన | 5:13,14 |

**B. లోకంలో మహాశ్రమలు : (6-18 అధ్యా)**

**1. ఏడు ముద్రలున్న పుస్తకము విప్పబడుట 6-8:1**

| | | |
|---|---|---|
| ఎ) | మొదటి ముద్ర విప్పబడుట | 6:1,2 |
| బి) | రెండవ ముద్ర విప్పబడుట | 6:3,4 |
| సి) | మూడవ ముద్ర విప్పబడుట | 6:5,6 |
| డి) | నాల్గవ ముద్ర విప్పబడుట | 6:7,8 |
| ఇ) | ఐదవ ముద్ర విప్పబడుట | 6:9-11 |
| ఎఫ్) | ఆరవ ముద్ర విప్పబడుట | 6:12-17 |
| జి) | విరామము | 7 అధ్యా |
| | ఆరవ ముద్రకు ఏడవ ముద్రకు మధ్య విరామమునకు కారణం | 7:1-3 |
| | ఇశ్రాయేలు శేషము ముద్రించబడుట | 7:4-8 |
| | అన్యుల నుండి విమోచించబడిన గొప్ప సమూహము | 7:9-17 |
| హెచ్) | ఏడవ ముద్ర విప్పబడుట - ఏడు బూరలు పట్టుకొన్న దూతలు | 8:1 |

**2. ఏడు బూరలు ఊదబడుట - 8:2 - 11:19**

| | | |
|---|---|---|
| ఎ) | సువర్ణ ధూపార్తి - పట్టుకొన్న దూత | 8:3-6 |

బి) మొదటి బూర – చెట్లు కాలిపోవుట 8:7

సి) రెండవ బూర – సముద్రము రక్తముగా మారుట 8:8,9

డి) మూడవ బూర – నీళ్ళు చేదుగా మారుట 8:10,11

ఇ) నాల్గవ బూర – సూర్యచంద్ర నక్షత్రాలకు చీకటి కమ్ముట 8:12,13

ఎఫ్) ఐదవ బూర – భూమి మీద రాలిన నక్షత్రం – మిడుతల తెగులు 9:1-12

జి) ఆరవ బూర – యూఫ్రటీసు నది యొద్దనున్న దూతలు వదలిపెట్టబడుట 9:13,21

హెచ్) ఆరవ బూరకు మరియు ఏడవ బూరకు మధ్య విరామం 10:1-11:14

- చిన్న పుస్తకము చేత పట్టుకొన్న బలిష్టుడైన దూత 10:1-7
- యోహాను చిన్న పుస్తకాన్ని తినుట 10:8-11
- "అన్యుల కాలము" ముగింపు తేది 11:1,2
- ఇద్దరు సాక్షుల ప్రవచన కాలము 11:3-12
- రెండవ శ్రమ – గొప్ప భూకంపం 11:13,14

ఐ) ఏడవ బూర – మహాశ్రమల అంతము మరియు పరలోకంలో దేవుని ఆలయం తెరవబడుట 11:15-19

**3. మహాశ్రమల కాలములోని ఏడుగురు పాత్రధారులు – 12, 13 అధ్యా**

ఎ) స్త్రీ – ఇశ్రాయేలు 12:1,2

బి) యెఱ్ఱని మహాఘటసర్పము – సాతాను 12:3,4

సి) స్త్రీ కనిన శిశువు – యేసుక్రీస్తు 12:5,6

డి) ప్రధాన దూతయైన మిఖాయేలు, ఘటసర్పంతో యుద్ధం చేయుట 12:7-12

ఇ) ఘట సర్పం స్త్రీని హింసించుట 12:17

ఎఫ్) ఇశ్రాయేలు శేషము 12:17

జి) సముద్రంలో నుండి పైకి వచ్చిన క్రూరమృగము – ఒక రాజకీయ శక్తి 13:1-10

1. కౄర మృగం వర్ణన 13:1,2
2. కౄర మృగం చావు దెబ్బ 13:3
3. కౄర మృగం దైవత్వాన్ని ఆరోపించుకొనుట 13:4,5
4. కౄర మృగం దేవుని దూషించుట 13:6-8
5. కౄర మృగం ఎవరినైనా తిరస్కరించుట 13:9,10

హెచ్) భూమిలో నుండి వచ్చిన కౄరమృగం – ఒక మతనాయకుడు 13:9,10

1. క్రూర మృగం వర్ణన 13:11

2. క్రూర మృగం ప్రాతినిధ్యపు అధికారం 13:12-14

3. క్రూర మృగం భూనివాసులను మోసము చేయుట 13:15-17

4. క్రూర మృగం యొక్క సంఖ్య 13:18

**4. మహాశ్రమల కాలపు చివరిదశ 14 అధ్యా**

ఎ) 1,44,000 మందితో గొఱ్ఱెపిల్ల 14:1-5

బి) నిత్యసువార్త ప్రకటన 14:6,7

సి) బబులోనుకు రానున్న తీర్పు ప్రకటించబడుట 14:8

డి) మృగము యొక్క గురుతు వేసికొన్న వారికి రానున్న తీర్పు ప్రకటించబడుట 14:9-12

ఇ) ప్రభువునందుండి మృతులైన వారి మెప్పు 14:13

ఎఫ్) హార్ మెగిద్దోను ముందు దృశ్యం 14:14-20

**5. ఏడు ఉగ్రత పాత్రలు క్రుమ్మరించబడుట - 15,16 అధ్యా**

ఎ) మహాశ్రమల తుది తీర్పును గూర్చి ప్రకటన 5:1-16:1

1. మహాశ్రమల నుండి వచ్చిన పరిశుద్ధులు దేవుణ్ణి ఆరాధించుట 15:1-4

బి) ఏడు సువర్ణ పాత్రలు పట్టుకొన్న ఏడుగురు దూతలు వెళ్ళడానికి
పరలోకంలోని ప్రత్యక్ష గుడారం తెరవబడుట

1. మొదటి పాత్ర క్రుమ్మరించబడుట 16:2

2. రెండవ పాత్ర క్రుమ్మరించబడుట 16:3

3. మూడవ పాత్ర క్రుమ్మరించబడుట 16:4-7

4. నాల్గవ పాత్ర క్రుమ్మరించబడుట 16:8,9

5. ఐదవ పాత్ర క్రుమ్మరించబడుట 16:10,11

6. ఆరవ పాత్ర క్రుమ్మరించబడుట 16:12

7. విరామము : లోకమందంతట నున్న రాజులను హార్‌మెగిద్దోను
అనుచోటికి సమకూర్చుట 16:13-16

8. ఏడవ పాత్ర క్రుమ్మరించబడుట 16:17-21

**6. రెండు బబులోనులకు తీర్పు తీర్చబడుట - 17, 18 అధ్యా**

**ఎ) మహాశ్రమలలో నున్న ఆత్మీయ భ్రష్ఠ సంఘం 17 అధ్యా**

1. క్రూరమృగము మీద కూర్చున్న ఒక స్త్రీ 17:1-7

| | | |
|---|---|---|
| 2. | క్రూరమృగము వేశ్యను నాశనము చేయుట | 17:8-18 |

**బి) రాజకీయ మరియు వర్తక సంబంధమైన బబులోనుకు తీర్పు తీర్చబడుట 18 అధ్యా**

| | | |
|---|---|---|
| 1. | రాజకీయ మరియు వర్తక సంబంధమైన బబులోను గూర్చిన ప్రకటన | 18:1-8 |
| 2. | బబులోను తీర్పును గూర్చి లోకం భయపడుట | 18:9-19 |
| 3. | బబులోను తీర్పును గూర్చి పరలోకంలో కలుగబోతున్న ఆనందం | 18:20-24 |

**సి) గొఱ్ఱె పిల్ల వివాహం మరియు తీర్పు తీర్చుటకు క్రీస్తు తిరిగి వచ్చుట 19 అధ్యా**

| | | |
|---|---|---|
| 1. | నాలుగు హల్లెలూయలు | 19:1-6 |
| 2. | గొఱ్ఱెపిల్ల వధువు మరియు వివాహ మహోత్సవం | 19:7-10 |
| 3. | క్రీస్తు రాజుల రాజుగా, ప్రభువుల ప్రభువుగా తిరిగి వచ్చుట | 19:11-16 |
| 4. | హార్‌మెగిద్దోను యుద్ధము | 19:17,18 |
| 5. | నరకము తెరువబడుట | 19:19-21 |

**డి) వెయ్యేండ్ల పాలన – 20 అధ్యా**

| | | |
|---|---|---|
| 1. | సాతాను 1000 సం॥ బంధించబడుట | 20:1-3 |
| 2. | మహా శ్రమలలోని పరిశుద్ధులు 1000 ఏండ్లు క్రీస్తుతో కూడ ఏలుట | 20:4-6 |
| 3. | 1000 ఏండ్ల తరువాత సాతాను విడిపించబడుట | 20:7-9 |
| 4. | సాతాను అగ్ని గంధకములు గల గుండములో పడవేయబడుట | 20:10 |
| 5. | ధవళసింహాసన తీర్పు – జీవగ్రంథంలో పేరు వ్రాయబడనివారు అగ్నిగుండములో పడవేయబడుట | 20:11-15 |

**ఇ) నిత్యత్వములోనికి ప్రవేశము, నిత్యత్వపు తెర తొలగించబడుట – 21,22 అధ్యా**

| | | |
|---|---|---|
| 1. | క్రొత్త ఆకాశము, క్రొత్త భూమి, నూతనమైన యెరూషలేము | 21:1,2 |
| 2. | నూతన యుగం | 21:3-8 |
| 3. | నూతన యెరూషలేము – వధువు నిత్యనివాసపు వర్ణణ | 21:9-21 |
| 4. | నూతన సంబంధం – మనుష్యులతో దేవుని నివాసం | 21:22,23 |
| 5. | నూతన సృష్టి యొక్క నూతన స్థలం | 21:24-27 |
| 6. | జీవజల నది మరియు జీవ వృక్షం | 22:1-5 |
| 7. | క్రీస్తు రాకడను గూర్చిన వాగ్దానం | 22:6-16 |
| 8. | చివరి ఆహ్వానం మరియు హెచ్చరిక | 22:17-19 |
| 9. | చివరి వాగ్దానం మరియు ప్రార్థన | 22:20,21 |

## C. అంశాల వారిగా సంగ్రహ సమీక్ష :

# మొదటి భాగం

## I. గొఱ్ఱె పిల్ల తన సాక్షులకు సూచనలిచ్చుట.

**A. దేవుని సేవకుడు (1:1-10) :** ఈ భాగంలో దేవుని సేవకుడైన యోహాను ప్రత్యేక సందేశాన్ని పొందడమును గూర్చి వ్రాయబడింది. ఈ సందేశం తండ్రివలన కుమారునికి, కుమారుని వలన దూతకు, దూత ద్వారా యోహానుకు ఇవ్వబడింది (1:1) ఈ సందేశంలో ఒక వాగ్దానం ఉన్నది (1:3) ధన్యుడు అనే మాట ఈ గ్రంథంలో 7 పర్యాయాలు ప్రస్తావించబడింది (1:3; 14:13; 16:15; 19:9; 20:6; 22:7; 22:14).

**1. సందేశానికి కారణం (1:3) :** ఈ గ్రంథంలో చెప్పబడిన సంగతులు సంభవించే సమయం ఆసన్నమైనది గనుక ఈ సందేశం ఇవ్వబడింది. వాటితో పాటు త్వరలో జరుగనున్న విషయాలను కూడ దేవుడు తన సేవకులకు తెలియజేయాలని కోరుతున్నాడు. (I పేతు 3:9; రోమా 16:20; ప్రక 1:1). ఈ వచనంలో సమయము అన్న మాటకు గడియారపు కాలమును సూచించే పదము కాక, ఖచ్చితమైన లేక నిర్ణయ కాలమును సూచించే "కానియోస్" అనే పదము ఉపయోగించబడింది.

**2. సందేశంలోని ముఖ్యాంశం (1:4) :** ఈ సందేశంలోని ముఖ్యాంశం యేసు క్రీస్తు వ్యక్తిత్వం మరియు పరిచర్య. ఆయన పరిచర్య మూడు దశలుగా వర్ణించబడింది.

ఎ) ఆయన గత పరిచర్య - విమోచన (1:5)

బి) ఆయన ప్రస్తుత పరిచర్య - శుద్ధీకరణ (1:6)

సి) ఆయన భవిష్యత్ పరిచర్య - మహిమ పరచబడుట (1:7)

ఈ సందేశం ఆసియాలో ఉన్న ఏడు సంఘాలకు ఇవ్వబడింది (1:4)

**3. యోహాను సందేశాన్ని పొందిన స్థలము మరియు సందర్భము (1:9,10) :**

యోహాను క్రీ॥శ॥ 86-96 సం॥లో పత్మాసు ద్వీపములో క్రీస్తు కొరకు బందీగా ఉన్నప్పుడు ఈ సందేశాన్ని పొందాడు. అతడు బహుశా డొమిషియన్ చక్రవర్తి వలన అక్కడ బంధించబడి ఉండవచ్చును. యోహాను శ్రమలలో సహితం దేవుని ప్రత్యక్షతను చూడగలిగాడు. ఆ దినాలలో రోమీయులు క్రైస్తవులను నాలుగు కారణాలను బట్టి హింసించారు.

**ఎ) రాజకీయ కారణాలు :** క్రైస్తవులు దృశ్యమైన దేవుణ్ణి ఆరాధించరు. ముఖ్యంగా చక్రవర్తి పూజచేయరు.

బి) **ఆర్థిక కారణాలు :** క్రైస్తవుల ద్వారా రోమా దేవతలకు బలులు, మ్రొక్కుబడుల ద్వారా ఏలాంటి ఆదాయం రాదు.

సి) నైతిక కారణాలు : క్రైస్తవులు వారి మతస్థాపకుని మాంసాన్ని భుజించి, ఆయన రక్తాన్ని త్రాగుతారు (ప్రభువు భోజనసంస్కారం) గనుక వారు నరమాంస భక్షకులన్న అభిప్రాయం ఉండేది.

డి) దేశంలో ఏ సమస్య వచ్చినా అందుకు క్రైస్తవులే బాధ్యులు అన్న అభిప్రాయం ఉండేది.

**B. దేవుని కుమారుడు (1:11-20) :** ఈ వచనాలలో దేవుని కుమారుడైన యేసుక్రీస్తు తన్నుతాను ప్రకటించుకొన్న విధానం (1:11), ఆయన వర్ణన (1:12-16), ఆయన విమోచన కార్యము (1:17,18) మరియు ఆయన నిర్వచనమును (1:19,20) గూర్చి వ్రాయబడింది.

**C. దేవుని సంఘాలు (2,3 అధ్యాయాలు) :** ప్రకటన గ్రంథం వ్రాయబడిన కాలం నాటికి (క్రీ॥శ॥ 95-100) వందకు పైగా స్థానిక సంఘాలున్నాయి. పౌలు స్వయంగా ప్రపంచవ్యాప్తంగా పలు సంఘాలను స్థాపించాడు. వీటిలో నుండి ఏడు సంఘాలను ప్రాతినిధ్యముగా చేసికొని వాటిని ఉద్దేశించి ఉత్తరాలు వ్రాయబడ్డాయి. వీటిని గూర్చి పలు అభిప్రాయాలున్నాయి.

**1. సమకాలీన ఉద్దేశం :** యోహాను కాలంలో ఉనికిలో ఉన్న అన్ని సంఘాలకు ఈ సందేశం ఇవ్వబడింది.

**2. సంయుక్త ఉద్దేశం :** అన్ని కాలాలలో ఉన్న అన్ని సంఘాలకు ఈ సందేశం వర్తిస్తుంది.

**3. చారిత్రక క్రమము అనే ఉద్దేశము :** ఈ ఏడు సంఘాల లక్షణాలు, క్రైస్తవ చరిత్రలోని ఏడు కాలములను, అనగా పెంతెకొస్తు దినము నుండి సంఘము ఎత్తబడేంత వరకు గల కాలములను సూచిస్తున్నది. ఈ అభిప్రాయం ప్రకారం సంఘ చరిత్రలోని కాల విభజనను ఇలా చెప్పుకోవచ్చును.

అ. ఎఫెసు సంఘం (2:1-7) : ఇది అపొస్తలిక సంఘము (క్రీ॥శ॥ 30-300)

ఆ. స్ముర్న సంఘము (2:8-11) : హింసించబడిన సంఘము - డయొక్లెషియన్ కాలం నుండి కాన్‌స్టంటైన్ కాలం వరకు గల సంఘం (క్రీ॥శ॥ 100-313).

ఇ. పెర్గము సంఘము (2:12-17) : కాన్‌స్టంటైన్ కాలము నాటి సంఘము (క్రీ॥శ॥ 314-590) రాజీతత్వం గల సంఘం.

ఈ. తుయతైర సంఘము (2:18-29) : సంఘ సంస్కరణ తరువాతి సంఘం. (క్రీ.శ. 590-1517).

ఉ. సార్దీస్ సంఘము (3:1-6) : సంస్కరించబడిన సంఘం (క్రీ.శ. 1517-1700).

ఊ. ఫిలదెల్ఫియా సంఘము (3:7-13) : సౌవార్త్రిక ఉద్యమ సంఘకాలము (క్రీ॥శ॥ 1700-1900).

ఎ) లవొదికయ సంఘము (3:14-22) : అంత్యకాల ఆత్మీయ భ్రష్టకాలము (క్రీ॥శ॥ 1900 నుండి సంఘం ఎత్తబడేంత వరకు).

ఈ ఏడు ఉత్తరాలు ఏడు సంఘాల దూతలను ఉద్దేశించి వ్రాయబడ్డాయి. ప్రతి సంఘమునకు మహిమలో ఉన్న క్రీస్తు లక్షణాలలో ఏదో ఒకటి బయలు పరచబడింది. (2:1,8,12,18; 3:1,7,14) ప్రారంభవచనాలలో సంఘాన్ని గూర్చిన మెప్పు ఉన్నది. (2:2,9,13,19; 3:1,8,15) తరువాత ఉపదేశం, తప్పుదిద్దుట, ఖండించుట, సవాలు ఉన్నది. చివరిలో వాగ్దానం ఉన్నది. (2:7,11,17,29; 3:6,13,22) చెవిగలవాడు ఆత్మ సంఘముతో చెప్పుచున్న మాట వినును గాక! అని ముగించబడింది.

## రెండవ భాగం

### II. గొఱ్ఱె పిల్ల ఆరాధన (4,5 అధ్యా)

నాల్గవ అధ్యాయం **"ఈ సంగతులు జరిగిన తరువాత"** అన్న మాటలతో ఆరంభించబడింది. ఈ సంగతులు అంటే సంఘము ఎత్తబడిన తరువాత అని అర్థం. మూడవ అధ్యాయానికి, నాల్గవ అధ్యాయానికి మధ్యకాలంలో సంఘమును గూర్చిన ప్రస్తావన లేదు. ఆ తరువాత 19వ అధ్యాయం వరకు కూడ ప్రస్తావించబడలేదు. సంఘము ఎత్తబడుటను గూర్చి రెండు వివరణలున్నాయి.

1. సాతాను ద్వారా కలిగించబడే మహాశ్రమలను బట్టి సంఘం పూర్తిగా తుడిచి వేయబడుతుంది. అన్నది ఒక తలంపు. కాని ఇది మత్తయి 16:18లోని వివరణకు విరుద్ధంగా ఉన్నది.

2. సంఘము క్రీస్తు ద్వారా మధ్యాకాశానికి తీసికొని పోబడుతుంది అన్నది మరో తలంపు. క్రొత్త నిబంధనలోని అనేక వాక్యాలు దీనిని బలపరుస్తున్నాయి (**I** కొరి 15:51; **I** థెస్స 4:16). నాల్గవ అధ్యాయం ప్రారంభంలో యోహాను ఒక ద్వారాన్ని (యోహా 10:9) చూస్తున్నాడు. ఒక బూర ధ్వనిని (**I** థెస్స 4:16) వింటున్నాడు. పరలోక రాజ్యాన్ని చూడడానికి అనుమతించబడిన మనుష్యులలో యోహాను రెండవవాడు.

ఎ) సింహాసనాసీనుడైన తండ్రి : యోహాను సింహాసనాసీనుడైన తండ్రి మహిమను చూసాడు. క్రొత్తనిబంధనలో మిగతా పుస్తకాలన్నిటిలో సింహాసనం అనే మాట 15 సార్లు వ్రాయబడింది. కాని ఒక్క ప్రకటన గ్రంథంలోనే 45 సార్లు వ్రాయబడింది. ఇది ఆయన సార్వభౌమత్వాన్ని సూచిస్తున్నది. 4:3లో ఆయన రూపం వర్ణించబడింది.

బి) ఇరువదినలుగురు పెద్దలు (4:4) : ఈ 24 గురుపెద్దలు, కొందరు తలంచినట్లు దూతలు కారు. వీరు ధరించిన కిరీటాలు రాజ్యపాలనకు సంబంధించినవి కావు. హతసాక్షుల కిరీటాలు అని అర్థమిచ్చే "స్టెఫెనాస్" అనే గ్రీకు పదం వాడబడింది.

కనుక వీరు మనుష్యులేనని, ఈ ఇరువదినలుగురు పాత నిబంధన మరియు క్రొత్త నిబంధన పరిశుద్ధులకు ప్రాతినిధ్యం వహిస్తున్న వర్గము అని చెప్తారు. దానియేలు తన దర్శనంలో సింహాసనములు వేయబడుటను చూసాడు (దాని 7:9) యోహాను వాటిపై 24 గురు పెద్దలు కూర్చొని ఉన్నట్లు చూసాడు.

సి) ఏడు దీపాలు (4:5) : 5వ వచనంలో ఏడు దీపాలు దేవుని ఏడాత్మలుగా చెప్పబడింది. ఇవి యేసు క్రీస్తు భూమ్మీది పరిచర్యకు (యెష 11:1–3); పరిశుద్ధాత్మ ఏడు విధాల పరిచర్యకు లేక తీర్పు తీర్చే దూతలకు (ప్రక 8:1–6) సూచనగా ఉన్నాయన్న అభిప్రాయాలున్నాయి.

డి) నాలుగు జీవులు (4:6–7) : ఈ జీవులను ఉద్దేశించి వ్రాయబడిన “జోవా” అనే గ్రీకు పదముకు జీవించు ప్రాణులు అని అర్థం. ఇవి యెహె 1:5–10; 10:20 లోని కెరూబులను మరియు యెష 6:2,3 లోని సెరాపులను పోలిన జీవులు. ఇవి ప్రత్యేక వర్గానికి చెందిన పరలోక జీవులు. యేసుక్రీస్తు భూలోక, పరలోక పరిచర్యలను నిత్యత్వం వరకు జ్ఞాపకం చేయడమే ఈ జీవుల పని, వాటి రూపమును బట్టి కూడ అవి యేసు పరిచర్యను సూచిస్తున్నాయి.

సింహంవంటి ముఖము గల మొదటి జీవి, మత్తయి సువార్తలో వివరించబడినట్లు యేసును రాజుగా సూచిస్తున్నది. దూడవంటి ముఖముగల జీవి, మార్కు వివరించినట్లు యేసును పరిచారకునిగా, మనిషి ముఖముగల జీవి, లూకా వివరించినట్లు యేసును మనుష్య కుమారునిగా, పక్షిరాజు ముఖముగల జీవి యోహాను వివరించినట్లు యేసును దేవుని కుమారునిగా సూచిస్తున్నది.

ఇ) **గొర్రె పిల్ల లక్షణాలు (5:1–7) :** ఈ భాగంలో యేసు యోగ్యత (5:5) విజయము, మరియు ఆయన అధికారం వర్ణించబడింది. ఏడు ముద్రలుగల గ్రంథాన్ని విప్పుటకు పరలోకంలోగాని, భూమిమీద గాని, భూమిక్రిందగాని ఎవరూ యోగ్యులుకారు. వధించబడిన గొర్రెపిల్లనే అందుకు యోగ్యుడు. క్రొత్త నిబంధనలో పెంపుడు గొర్రెపిల్లను గూర్చి 29 సార్లు, వధించబడిన గొర్రెపిల్లను గూర్చి 7 సార్లు వ్రాయబడింది. వధించబడిన గొర్రెపిల్లకు ఉపయోగించబడిన “స్పాట్టో” అనే గ్రీకు పదము నాలుగుసార్లు యేసు క్రీస్తును ఉద్దేశించి వ్రాయబడింది. (ప్రక. 5:6,9,12; 13:8). ఈ గొర్రెపిల్ల 7 కొమ్ములు ఆయన సర్వశక్తిమంతుడని, 7 కళ్ళు ఆయన సర్వజ్ఞుడని సూచిస్తున్నాయి.

ఈ భాగంలో ఆయన గొర్రెపిల్లగానే కాకుండ, యూదా గోత్రపు కొదమ సింహము వలె కూడ కనిపిస్తున్నాడు. గొర్రెపిల్ల ఆయన గత పరిచర్యకు, సింహము ఆయన భవిష్యత్ పరిచర్యకు సూచనగా ఉన్నాయి.

గొర్రెపిల్ల ఏడు ముద్రలుగల గ్రంథాన్ని తీసికొనగానే నాలుగు జీవులు, 24 గురు పెద్దలు ఆయన ఎదుట సాష్టాంగపడ్డారు. అన్ని దిశల నుండి అందరు ఈ ఆరాధనలో పాల్గొన్నారు. 24 గురు పెద్దలు, నాలుగు జీవులు, అసంఖ్యాకులైన దూతలు, భూ

ప్రజలు మరియు భూమిక్రిందనున్న వారందరు ఆయనను స్తుతించారు (5:8-14). యోహాను తాను వినిన మాటలను **(sayings),** పాటలను **(songs)** ప్రత్యేకపర్చాడు. దూతలు, ఇతర జీవులు ఆయనను మాటలతో ఆరాధించారు. (5:12,13) రక్షించబడినవారు పాటలు పాడారు. (5:9,10) అవును విమోచించబడినవారే, యేసు క్రీస్తు రక్తముతో కడుగబడినవారే, ఆ రక్షణ ఔన్నత్యాన్ని గూర్చి క్రొత్త పాట పాడగలరు. (కీర్త 40:3). ఈ ఆరాధనలో ఆయన చేసిన కార్యము వివరించబడింది (5:9) "గొఱ్ఱెపిల్ల నీవు యోగ్యుడవు" అన్నదే ఆరాధన ముఖ్యాంశం. అందులో ఆయన ప్రస్తుత అర్హతలు కూడ వర్ణించబడ్డాయి (5:12).

## మూడవ భాగం

**III. గొఱ్ఱెపిల్ల ఉగ్రత (6-19 అధ్యా) :** ఇంతవరకు యోహాను పాఠకులను పరలోకంలో విహరింపచేసాడు. ఇప్పుడు భూమి మీదికి తీసికొని వెళ్ళి దాని పరిస్థితిని చూపిస్తున్నాడు. ప్రస్తుతం మనం జీవిస్తున్న కాలంలోనే మనల్ని భయకంపితులను చేసే విషయాలెన్నో ఈ భూగోళంలో కనిపిస్తున్నాయి. అంటే, దేవుడు మానవుల కార్యకలాపాలలో జోక్యం చేసికొనే సమయం ఆసన్నమైంది. గనుక ఈ లోకానికి తీర్పు తీర్చడానికి తన కుమారునికి అధికారమిచ్చాడు. ఆయన మానవునిగా లోకానికి వచ్చినపుడు తీర్పు తీర్చడానికి పంపబడలేదు. (యోహా 3:17) కాని ఆయన హెచ్చించబడ్డాక తీర్పు తీర్చడానికి నియమించబడ్డాడు (అపో. 17:31) ఆయన ఉగ్రత ఏడు విధాలుగా వెల్లడించబడింది.

**అ. ఏడు ముద్రలు విప్పుట ద్వారా తీర్పు (ప్రక 6:1-17; 8:1-9:21; మత్త 24:4-8).**

ఎ. మొదటి ముద్ర విప్పినపుడు తెల్ల గుఱ్ఱము మీద విల్లు పట్టుకొని కూర్చున్నవాడు క్రీస్తు విరోధికి సాదృశ్యంగా ఉన్నాడు (6:2) వాడు పునరుద్ధరించబడిన రోమా సామ్రాజ్యపు పదిదేశాలను జయిస్తాడు. దానినే కోల్డ్‌వార్ కాలంగా చెప్పుకోవచ్చును.

బి. రెండవ ముద్ర విప్పినప్పుడు ఎఱ్ఱని గుఱ్ఱముపైన కూర్చున్నవానికి భూమి మీద సమాధానం లేకుండ చేయడానికి అధికారం ఇవ్వబడింది (6:4). లోకంలో దౌష్ట్యం మితిమీరినందువల్ల నెమ్మది ఉండదు (యెష 57:20,21). శతృత్వం, వైరం అధికమౌతుంది. క్రీస్తు విరోధి సమాధానమును వాగ్దానం చేసినా, అది తాత్కాలికంగానే ఉంటుంది.

సి. మూడవ ముద్ర విప్పినపుడు నల్ల గుఱ్ఱము మీద త్రాసు పట్టుకొనినవాడు కరవును, ధాన్య కొరతను సూచిస్తున్నాడు (6:5,6). నూనె, ద్రాక్షారసం వంటి ఖరీదైన వస్తువుల కొరత ఉండదు కాని వాటి ధర పెరగడం వలన కొనలేకపోతారు. ఈ పరిస్థితి సామాన్య ప్రజల పేదరికానికే కారణమౌతుంది.

డి. నాల్గవ ముద్ర విప్పినప్పుడు పాండుర వర్ణముగల గుఱ్ఱముపై నున్నవాని పేరు మృతువు(6:8). వీనికి ఖడ్గము, కరవు, మరణము వలన, క్రూర మృగమువలన మనుష్యులను చంపుటకు భూమి యొక్క నాలుగవ భాగముపై అధికారం ఇవ్వబడింది.

ఇ. ఐదవ ముద్ర విప్పినప్పుడు యోహాను, క్రీస్తు కొరకు హతసాక్షులైనవారి ఆత్మలను బలిపీఠము క్రింద చూసాడు (6:9–11). ఆ కాలంలో ఇది వరకు ఎన్నడు లేనంతగా మతపరమైన హింసలు కలుగుతాయి. ఈ హతసాక్షుల ఆత్మలను గూర్చి బైబిలు పండితులు విభిన్న అభిప్రాయాలు కలిగి ఉన్నారు. కొంతమంది ఈ వాక్య భాగమును బట్టి ఆత్మలు నిద్రిస్తున్నాయన్న సిద్ధాంతాన్ని తృణీకరిస్తారు. అందరికీ ఒకే పునరుత్థానం ఉండదని, సంఘము ఎత్తబడినపుడు, సంఘకాలంలోని పరిశుద్ధుల వలె, ఈ హతసాక్షులు పునరుత్థాన శరీరాలను పొందలేదని ఈ భాగం స్పష్టం చేస్తున్నది. దీనిని బట్టి, పాత నిబంధన పరిశుద్ధులు మహాశ్రమల కాలం తరువాత అనగా క్రీస్తు రెండవ రాకడలో శాశ్వత పునరుత్థాన శరీరాలు పొందుతారు. అంతవరకు పరలోకంలో ఉండగలిగేందుకు వీలైన తాత్కాలిక శరీరాలు ఇవ్వబడతాయి.

ఎఫ్) ఆరవ ముద్ర విప్పబడినపుడు (6:12–17) ప్రపంచ చరిత్రలో ఇది వరకు ఎన్నడు నమోదు కాని గొప్ప భూకంపం కలుగుతుంది. రోదసీలో గందరగోళ పరిస్థితి ఏర్పడుతుంది. బహుశా ఇది అణ్వస్త్రాల యుద్ధప్రభావం కావచ్చును. ఈ పరిస్థితిలో ప్రపంచంలోని ప్రతి వర్గం ప్రజలు చరిత్రలో కనివిని ఎరుగని గొప్ప ప్రార్థన చేస్తారు (6:15,17). ఈ ప్రార్థన సృష్టకర్తకు చేసినది కాదు. సృష్టితో చేయబడిన ఈ ప్రార్థన మనవి లేక వారి మొఱ కూడ సరైనది కాదు.

జి) ఆరవ ముద్రకు, ఏడవ ముద్రకు మధ్య విరామ సమయం ఉన్నది. ఈ కాలంలో రెండు గుర్తించదగిన సంఘటనలు జరుగుతాయి.

1. 1,44,000 మంది మారుమనస్సు పొందుతారు (7:1–8) వీరిని గూర్చి డా. జె.డ్వైట్ పెంటెకోస్ట్ అనే బైబిలు పండితుడు, సంఘం ఎత్తబడ్డాక కూడ దేవుడు ఆ కాలమందు వీరిని రక్షిస్తాడని I కొరి 15:8 ని ఆధారంగా చేసికొని చెప్పాడు. ఈ భాగంలో మహాశ్రమల కాలంలో యూదులు మాత్రమే రక్షించబడతారని చెప్పబడలేదు. ప్రతి జాతి నుండి కూడ లెక్కింపజాలని గొప్ప సమూహం రక్షించబడినట్లు వ్రాయబడింది. దీనిని బట్టి మత్తయి 24:14లోని ప్రవచనం నెరవేర్చబడుతుంది. ఈ భాగంలోని గోత్రాల వరుసలో నాల్గవవాడైన యూదా జ్యేష్ఠుడైన రూబేను స్థానంలో ఉంచబడ్డాడు. విగ్రహారాధన అనే అపరాధమును బట్టి దాను మరియు ఎఫ్రాయిము గోత్రాలు పేర్కొనబడలేదు. (న్యాయా 18 అధ్యా; I రాజు 11:26; హోషే 4 అధ్యా). వారి స్థానాన్ని లేవీ మరియు మనష్షే గోత్రాలు ఆక్రమించుకొన్నాయి. కొంతమంది ఆది. 49:17 మరియు యిర్మీయా 8:16ను బట్టి క్రీస్తు విరోధి దాను గోత్రము నుండి వస్తాడని చెప్తారు.

2. గొప్ప సమూహము రక్షించబడుట (7:9-17). వీరి సంఖ్య లెక్కకు మించినది (7:9). వారు తమ రక్షణను బట్టి గొఱ్ఱెపిల్లను స్తుతిస్తున్నారు. (7:10-12). వీరు రాత్రిం బగళ్ళు దేవుణ్ణి సేవిస్తారు (7:15). అందుకు ప్రతి ఫలంగా వారు గొఱ్ఱెపిల్ల ద్వారా పోషించబడి సంరక్షించబడతారు (7:15-17). వీరు మహాశ్రమలలో నుండి వచ్చినవారు (7:14).

**హెచ్. ఏడవముద్ర (8:1-11:19) :** పరలోకంలో అర్థగంట సేపు నిశ్శబ్దం ఆవరించినట్లు నమోదు చేయబడిన సంఘటన ఇదొక్కటే. బైబిలులో 30 అనే సంఖ్య ప్రలాపమును సూచిస్తున్నది (సంఖ్యా 20:29; ద్వితీ 34:8). ఆరవ ముద్ర విప్పబడినపుడు, మానవాళి తుడిచిపెట్టుకొని పోయినట్లయినందు వలన దేవునికి కలిగిన దుఃఖం ఈ నిశ్శబ్దానికి కారణం (యెహె 33:11).

**ఏడవ ముద్ర విప్పబడినపుడు ఏడుగురు దూతలు ఏడు బూరలను ఊదారు.**

**1.** **మొదటి బూర** ఊదబడినపుడు భూగ్రహంపై వృక్షసంపద నాశనం చేయబడింది (8:7). తద్వారా ప్రాణవాయువు కొరత ఏర్పడుతుంది.

**2.** **రెండవ బూర** ఊదబడినపుడు జలచరాలు నాశనం చేయబడ్డాయి (8:8-9)

**3.** **మూడవ బూర** ఊదబడినపుడు మాచిపత్రి అనే నక్షత్రం ద్వారా మూడవ భాగం నదులలోని నీళ్ళు చేదుగా మారి మనుష్యులలో అనేకులు చస్తారు (8,10), 2వ బూర ద్వారా సముద్రంలోని ఉప్పునీరు పాడైపోతుంది. మాచిపత్రి ద్వారా మంచినీరు పాడైపోతుంది.

**4.** **నాల్గవ బూర** ఊదబడినపుడు సూర్యచంద్రనక్షత్రాలలో మూడవ భాగం చీకటి కమ్ముతుంది.

**5.** **ఐదవ బూర** ఊదబడినపుడు అగాధంలోని దురాత్మలు బయటికి వస్తాయి వీటి రూపం, మిడతలను పోలినది. 9:1-11 తమ నోసళ్ళయందు ముద్ర వేయించుకొనని వారికి అవిబాధను కలిగిస్తాయి.

**6.** **ఆరవ బూర** ఊదబడినపుడు దురాత్మలు భూమిని ఆక్రమిస్తాయి. ఇది మహా శ్రమల కాలంలో జరిగే రెండవ దాడి (9:13-21). ఈ దాడిలో నలుగురు సాతాను దూతలు వాని పక్షంగా నాయకత్వం వహిస్తారు. ఈ దాడిలోని దురాత్మలు మొదటి దాడిలోని వంటివి కావు, అవి గుఱ్ఱాలను పోలి ఉన్నాయి. ఈ భూమి మీద పాపము మరియు అసత్యమతం ప్రారంభించబడిన యూఫ్రటీసునది వద్దనే ఈ దాడి ప్రారంభమౌతుంది. జెక 5:8-11; ఆది 3 అధ్యా; 10:9,10; 11:4) అక్కడే అది అంతమౌతుంది. (ప్రక 17-18). ఈ దాడి 13 నెలలు జరుగుతుంది. దాని వల్ల ప్రపంచంలోని సగం జనాభా నశించినా, మిగిలిన వారు మారుమనస్సు పొందక పోగా మరి ఎక్కువ తిరుగుబాటు స్వభావం కలిగి ఉంటారు.

**7. విరామం (ప్రక 10:1-11:14) :** ఆరవ ముద్ర మరియు ఏడవ ముద్రకు మధ్య విరామమున్నట్లు ఆరవ బూరకు ఏడవబూరకు మధ్య విరామమున్నది. ఈ విరామంలో 3 సంగతులు జరుగుతాయి.

ఎ. దేవుని దూత ద్వారా సందేశం (10:1-11)

బి. దేవుని మందిరం కొలువబడుట (11:1,2)

సి. దేవుని సాక్షుల పరిచర్య (1:3-14)

ఈ ఇద్దరు సాక్షులను గూర్చి పలు అభిప్రాయాలున్నాయి. హెబ్రీ 9:27 ను బట్టి వీరు హనోకు మరియు ఏలియా అని ఒక అభిప్రాయం. వీరిద్దరు మోషే మరియు ఏలియా చేసిన అద్భుతాలనే చేసారు గనుక వారు మోషే, ఏలియాలు అన్న మరో అభిప్రాయం ఉన్నది (నిర్గ 4:9; 7:17-24; **I** రాజు 17:1 ప్రక 11:6). అంత మాత్రమే కాదు వీరిద్దరూ యేసు రూపాంతర సమయంలో కనిపించారు. (మత్తయి 17:3) వీరిద్దరు దేవునిచే అభిషేకించబడిన దీపస్తంభాలుగా ప్రజల మధ్య ప్రవచనం చెప్పాలి. తమను నాశనం చేయడానికి శత్రువులు చేసినట్లే వారు కూడ చేస్తారు. తుదకు వారిని చంపడానికి క్రీస్తు విరోధి అనుమతించబడతాడు. అయితే వారి సాక్ష్యాన్ని ముగించేంతవరకు వారిని ఏమి చెయ్యలేక పోయాడన్నది గమనార్హం. (11:7) వీరిద్దరూ పౌలులాగ తమ సాక్ష్యాన్ని తుదముట్టించారు. (**II** తిమో 4:7). వారి శవాలు యెరూషలేము వీధుల్లో పారవేయబడతాయి. ప్రపంచంలోని ప్రజలందరూ వారి గతి చూచి సంతోషిస్తారు. $3^1/_2$ దినములైన తరువాత వారు తిరిగిలేస్తారు.

**8) ఏడవ బూర (11:15-19) :** ఏడవ దూత బూర ఊదినపుడు పరలోకంలో గొప్ప శబ్దాలు "ఈ లోక రాజ్యము, మన ప్రభువు రాజ్యమును ఆయన క్రీస్తు రాజ్యము నాయెను; ఆయన యుగయుగముల వరకు ఏలును" అన్న ప్రకటన చేస్తాయి. ఈ ప్రకటన విని పరలోకంలో ఉన్నవారు సంతోషిస్తారు, భూలోకంలో ఉన్నవారు కోపంతో నింపబడతారు. ఏడవ బూర ఊదబడినపుడు పరలోకమందు దేవాలయం తెరువబడుతుంది (11:19).

**ఆ. సాతాను పరిపాలన ద్వారా తీర్పు (12-13 అధ్యా) - యూదుల పట్ల సాతాను కార్యం.**

**A. గతంలో, ఇశ్రాయేలు పట్ల వానికుండిన ద్వేషం. (12:1-5).**

**1. 12 నక్షత్రాలున్న స్త్రీ (12:1,2)** ఇశ్రాయేలు జాతికి సాదృశ్యంగా ఉన్నది. ప్రకటన గ్రంథంలో సూచనలుగా ఉన్న నలుగురు స్త్రీలలో మొదటిది. ప్రక 12:2 లో అబ్రాహాము మొదలుకొని క్రీస్తు జన్మ కొరకు ఇశ్రాయేలు జాతి చరిత్ర వివరించబడింది.

**2. ఏడు తలలున్న మహాఘట సర్పము (12:3-5)** గుర్తింపును గూర్చి కేవలం ప్రకటన 12వ అధ్యాయంలోనే 7 పేర్లు ఇవ్వబడ్డాయి.

ఎ) యెఱ్ఱని మహాఘట సర్పము 12:3

బి) ఆది సర్పము 12:9

సి) సాతాను 12:9

డి) సర్వలోకాన్ని మోసగించేవాడు 12:9

ఇ) ఫిర్యాదియైన అపవాది 12:10 (యోబు 1,2; జెక 3:1-7)

ఎఫ్) స్త్రీని బాధించినవాడు 12:4

జి) క్రీస్తును ద్వేషించువాడు 12:5

**B. ఇశ్రాయేలు పట్ల భవిష్యత్తులో వాడు చూపించే ద్వేషం (12:6-17)**

1. మిఖాయేలుతో యుద్ధం (12:7).

2. ఇశ్రాయేలు పట్ల రౌద్రం (12:13,15,17). ఇశ్రాయేలు జాతిని నాశనం చేయడానికి సాతాను చేసిన, చేస్తున్న ప్రయత్నాలు చరిత్ర అంతటిలో కనిపిస్తాయి. ఇదే వాని చివరి ప్రయత్నం. అయితే అందులో దేవుడే జోక్యం చేసికొని తన కొరకు శేషాన్ని నిలుపు కొంటాడు. దేవుని కొరకు నమ్మకంగా ఉన్న 1/3 వంతు శేషం మహాశ్రమల కాలంలో ప్రత్యేక స్థలంలో (బహుషా పెట్రాలో) దేవునిచే దాచబడతారు. (12:4) జెక 14:5; యెష 63:1, దాని 11:41 చదవండి. పై కారణాన్ని బట్టి ఎదోము దేశాన్ని దేవుడు క్రీస్తు విరోధి ఆధీనంలోనికి రానివ్వడు అనే అభిప్రాయం ఉన్నది.

**C. సాతాను మరియు ప్రవచనం (13 అధ్యా)**

**అ. వాని పటాలం - క్రీస్తు విరోధి (13:1-10) :** (దాని 7:35; 11:36; **II** థెస్స 2:3,4,9; **I** యోహా 2:22; ప్రక 6:2; కూడ చదవండి).

**1. వాని వ్యక్తిగత లక్షణాలు :** క్రీస్తు విరోధి వాగ్దాటిలో(దాని 11:36) వాణిజ్య పరంగా (ప్రక 13:16,17; దాని 11:43), రాజకీయపరంగా (ప్రక 17:11,12) సైనికపరంగా (ప్రక 6:2, 13:2), మతపరంగా (ప్రక 13:8; **II** థెస్స 2:4) జ్ఞానం గలవాడు. (దాని 8:23).

**2. వాని బిరుదులు :** క్రీస్తు విరోధి అన్న పేరుతో పాటు, వానికి పాప పురుషుడు (**II** థెస్స 2:3) నాశనపుత్రుడు, దుష్టుడు (**II** థెస్స 2:8) రాజు (దాని 11:36) మృగం (ప్రక 11:7) చిన్న కొమ్ము (దాని 7:8) అనే బిరుదులున్నాయి.

**3. వాని గుర్తింపు :** (ఎ) ప్రక 13:1లో పేర్కొన్నట్లు వాడు సముద్రంలో నుండి వస్తాడు. సముద్రం అన్య జనాంగానికి సూచనగా ఉన్నది గనుక వాడు అన్యజనాంగం నుండి వస్తాడని, దాని 8:8,9 ని బట్టి గ్రేకీయుల నుండి వస్తాడని, దాని 9:26 ను బట్టి రోమీయుల నుండి వస్తాడన్న అభిప్రాయం ఉన్నది. దాని 11:37 లో వాడు తన పితరులను లక్ష్యపెట్టడు అని వ్రాయబడిన దానిని బట్టి వాడు యూదుల నుండే వస్తాడన్న అభిప్రాయం ఉన్నా, వాడు యూదులను హింసిస్తాడు గనుక యూదేతరుడై యుండవచ్చునన్న అభిప్రాయమే బలపర్చబడింది.

4. **క్రీస్తు విరోధి అధికారాన్ని పొందుట :** క్రీస్తు విరోధి, సాతాను శక్తి ద్వారా (ప్రక 13:2; **II** థెస్స 2:3, 9-12) మరియు పరిశుద్ధాత్మ అనుమతించుట ద్వారా అధికారాన్ని పొందుతాడు. ప్రస్తుతం పరిశుద్ధాత్మ వాణ్ణి అడ్డగిస్తున్నాడు. కాని సంఘం ఎత్తబడ్డాక వాణ్ణి అనుమతిస్తాడు. వాడు అధికారాన్ని పొందినప్పటికిని, అన్నీ దేవుని ఆధీనంలోనే ఉంటాయి. (యోబు 1,2, **II** థెస్స 2:6,7).

5. **వాని పనులు :** క్రీస్తు విరోధి పాశ్చాత్య అధికారాన్ని అదుపు చేయనారంభిస్తాడు (ప్రక 17:12) ఇశ్రాయేలీయులతో 7 సం॥ల నిబంధన చేస్తాడు కాని $3^1/_2$ సం॥లకు త్రెంచివేస్తాడు. (దాని 9:27) క్రీస్తు విరోధి మహాశ్రమల కాలంలో మందిర నిర్మాణాన్ని బలులను ప్రోత్సహించినట్లు వాక్యాధారాలున్నాయి. (దాని 9:27 మత్త 24:15; **II** థెస్స 2:4; ప్రక 13:14, 11:2) రష్యాపై దాడి అనంతరం మధ్య ప్రాచ్య దేశాలపై పూర్తిగా అధిపత్యం వహిస్తాడు. (యెహె 38, 39) ఇశ్రాయేలీయులను నాశనం చేయడానికి ప్రయత్నిస్తాడు. తన నిరాటంక పాలన కొరకు అసత్యమత విధానాన్ని నాశనం చేస్తాడు. (17:16,17) తానే దేవుణ్ణని చెప్పుకొంటాడు (దాని 11:36; **II** థెస్స 2:4-11 ప్రక 13:5) అన్ని దేశాలను స్వల్పకాలం పరిపాలిస్తాడు (కీర్త 2; దాని 11:36, ప్రక 13:16).

6. **వాని అనుకరణ శక్తి :** క్రీస్తు విరోధి క్రీస్తును, ఆయన పనిని అనుకరించడానికి ప్రయత్నిస్తాడు. కాని ఆయనకు పూర్తిగా భిన్నమైనవాడు. హెబ్రీ 1:3; 1:15ను ప్రక 13:4 **II** థెస్స 2:9తో; యోహా 6:38ను ప్రక 11:7తో; ప్రక 5:6-9 ని 13:2 తో మత్త 28:18ని 13:2తో ఫిలి 2:10,11 ను ప్రక 13:4,5,8 తో, యోహా 7:46ను దాని 7:8 ప్రక 13:5తో పోల్చి చూడండి.

ఆ. **సాతాను పటాలం - అబద్ధ ప్రవక్త (13:11-18) :** అబద్ధ ప్రవక్త గుర్తింపు ఇక్కడ రెండవ మృగముగా వ్రాయబడింది, కాని ప్రక 16:13; 19:20; 20:10లో అబద్ధ ప్రవక్త అని వ్రాయబడింది. ఇతడు యూదులలో నుండి వస్తాడని, భ్రష్టసంఘానికి ఆధిపత్యం వహిస్తాడని కొంతమంది అభిప్రాయం, క్రీస్తు విరోధి, క్రీస్తును అనుకరించడానికి ప్రయత్నిస్తే, అబద్ధ ప్రవక్త పరిశుద్ధాత్మను అనుకరణ చేస్తాడు. కాని ఆయనకు వ్యతిరేకంగా పని చేస్తాడు. (యోహా 16:13ను ప్రక 13:11,14తో, యోహా 16:13, 14ను ప్రక 13:12తో అపొ 2:3ను ప్రక 13:13తో; రోమా 8:2ను ప్రక 13:15తో ఎఫె 1:13ను ప్రక 13:16తో పోల్చి చూడండి. వాని గుర్తు 666 అనే సంఖ్య (ప్రక 13:16-18).

ఇ. **ఉగ్రత పాత్రల ద్వారా తీర్పు (14-16 అధ్యా)**

**A. ఉగ్రత పాత్రల ద్వారా జరుగబోయే తీర్పుకు ముందు 14, 15 అధ్యాయాలలో పరలోకంలో జరిగిన విషయాలు నమోదు చేయబడ్డాయి.**

1. 1,44,000 మంది పాడిన కీర్తన (14:1-5) ఈ గుంపు 7వ అధ్యాయంలో ప్రస్తావించబడిన గుంపు.
2. ముగ్గురు ప్రత్యేక దూతల ద్వారా ఇవ్వబడిన మూడు సందేశాలు (14:6-12)
3. ఆత్మ చెప్పిన మాటలు (14:13)
4. హార్‌మెగిద్దోను గూర్చిన మొదటి ప్రకటన (14:14-20)
5. పరలోకంలోని దేవాలయంలోని దృశ్యాలు మరియు శబ్దాలు
ఎ) విజయ గీతాలు (15:2-4)
బి) ఆలయం పొగతోనింపబడుట (15:8)

**B. ఉగ్రత పాత్రల ద్వారా తీర్పు జరుగుతున్నప్పుడు జరిగే సంఘటనలు (16:2-21)**

**ఈ. ప్రపంచ మత విధానం నిర్మూలం చేయబడుట ద్వారా తీర్పు (17 అధ్యా) :** 17:1లో ప్రస్తావించబడిన మహావేశ్య మరెవరో కాదు గాని సార్వత్రిక అసత్య సంఘం, అనగా సాతానుకు భార్య అని చెప్పవచ్చును.

**A. వేశ్య చారిత్రాత్మక దృశ్యం**

సాతాను సంఘం క్రీ.పూ. 24 శతాబ్దాల క్రితమే బాబెలు గోపురం వద్దనే ప్రాంభమైంది (ఆది 11:1-9).

సాతాను, మొదటి సంపూర్ణ సేవకుడు నిమ్రోదు (ఆది 10:8-10). నిమ్రోదు సెమెరిమస్ అనే దుష్టురాలిని పెళ్ళిచేసికొన్నాడని ఆమె తనకు పుట్టిన జ్యేష్ఠ కుమారుడైన తమ్మూజు, దేవుడు వాగ్ధానం చేసిన (ఆది 3:15) రక్షకుడని చెప్పుకొనేదని పారంపర్యం ఉన్నది. అలా ఆమె ఒక క్రొత్త మత స్థాపన చేసి తనే ప్రధాన యాజకురాలిగా ప్రకటించుకొన్నది. తాను తన కుమారుడు పూజించబడాలని కోరింది. అలా ప్రపంచమంతా ఈ మత శాఖ వ్యాపించి, క్రీ.పూ. 539 నాటికి బబులోను సాతాను ఆరాధనకు ప్రధాన పీఠంగా మారింది. అక్కడి నుండి ఫెనికెయి, ఐగుప్తు, గ్రీకు, రోమా, చైనా దేశాలకు వ్యాపించింది. వీరి ఆరాధనలన్నీ తల్లీ కుమారులకు సంబంధించినవే.

ఈ సాతాను సంఘ బోధ ఏమంటే, సెమెరిమస్ (ఆకాశరాణి) దేవుని వద్దకు వెళ్ళడానికి మార్గము. పలు బలులు మరియు శుద్ధజలం చల్లడం ద్వారా ఆమెనే పాపికి రక్షణ నిస్తుంది. ఆమె కుమారుడైన తమ్మూజును ఎలుగుబంటి చంపిందని అతడు 40 రోజుల అనంతరం తిరిగి లేచాడని, తమ్మూజు ఆలయంలోని కన్యకలందరు 40రోజులు ఉపవాసం ఉంటారు.

క్రీ.పూ. 2000 సం॥ల క్రితం దేవుడు వీటన్నిటి నుండి అబ్రాహామును బయటికి తీసికొని వచ్చి (యెహో 24:2,3) ఒక ప్రత్యేక జనాంగముగా ఏర్పరచుకొన్నాడు. కాని క్రీ.పూ. 9వ శతాబ్దం నుండి ఇశ్రాయేలీయులు ఈ మతాచారాలను బయలు

దేవత పేరిట జరిగిస్తూ వచ్చారు (I రాజు 16:30-33). యెహెజ్కేలు మరియు యిర్మీయా దీని విషయం వారిని ఖండించాడు (యోహా 8:14; యిర్మీ 7:18; 44:25), ఆ తరువాత రోమీయుల కాలంలో చక్రవర్తి పూజగా, చివరికి క్రీ.శ. 306 సం॥లో రోమా చక్రవర్తియైన కాంస్టంటైన్ ద్వారా సంఘంలో భ్రష్టత్వాన్ని ప్రవేశింపజేయుట ద్వారా సాతాను దానిని కొనసాగిస్తూవచ్చాడు.

**B. వేశ్య ప్రస్తుత దృశ్యం :** మార్మికమైన బబులోను ఈ దినాలలోను పని చేస్తున్నదా? అన్న ప్రశ్నకు మునుపటికన్న మరెక్కువ బలంగా మరెక్కువ పాపంతో నిండి ఉన్నదని చెప్పవచ్చును. దీనిని గూర్చి ముగ్గురు క్రొత్త నిబంధన గ్రంథకర్తలు వ్రాసారు.

1. పౌలు (**II** తిమో 3:1-5)
2. పేతురు (**II** పేతు 2:1)
3. యోహాను (ప్రక 3:15-17)

మహా వేశ్యగా వర్ణించబడిన ఈ సంఘం ప్రొటస్టంటు, కాథొలిక్, యూదా, మరియు ప్రపంచంలోని ఇతర పెద్ద మతాల నుండి వచ్చిన మత భ్రష్ట సమూహాల కలయిక కావచ్చును.

**C. వేశ్య ప్రవచనాత్మక దృశ్యం :**

ఈ స్త్రీ యొక్క భవిష్యత్తు ఏంటి? ప్రకటన 17వ అధ్యాయం ప్రకారం ఈ అసత్యసంఘం మహాశ్రమల కాలంలోని మొదటి భాగంలోనున్న క్రీస్తు విరోధిని తన దుష్టశక్తితో ప్రోత్సహిస్తుంది. ఈ సంఘం తాత్కాలికంగా అభివృద్ధి చెందినప్పటికిని, క్రీస్తు విరోధికి అధికారమిచ్చాక వానిని తన అదుపులో ఉంచుకోడానికి ప్రయత్నించడం వలన అది అణచివేయుబడుతుంది (17:16). క్రీస్తు విరోధి మొదట ఈ వేశ్యను అసహ్యించుకొంటాడు, తరువాత దోచుకొంటాడు, అవమానపరుస్తాడు తరువాత దానిని కబళించి నాశనం చేస్తాడు.

**ఉ. ప్రపంచ ఆర్థిక విధానం నాశనం చేయబడుట ద్వారా (18 అధ్యా) :** ప్రకటన 17, 18 అధ్యాయాలలో రెండు బబులోనులు మనముందు ఉంచబడ్డాయి. 17వ అధ్యాయంలోని బబులోను మత సంబంధమైనది. 18వ అధ్యాయంలోని బబులోను, రాజకీయ మరియు ఆర్థిక సంబంధమైనది. మొదటి బబులోను అనబడే భ్రష్ట సంఘం భూరాజులచే ద్వేషించబడింది (17:16). కాని ఆర్థిక లేక వాణిజ్య విధానం అనే రెండవ బబులోను భూరాజులచే ప్రేమించబడింది (18:9). మొదటి బబులోను బూరాజులచే నాశనం చేయబడింది. రెండవ బబులోను దేవుని తీర్పుతో నాశనం చేయబడింది. (5,8 వచనాలు) మొదటి బబులోను మహాశ్రమల కాలం మధ్యలో, రెండవ బబులోను క్రీస్తు రెండవ రాకడ సమయంలో నాశనం చేయబడతాయి. ఇవి రెండూ ఒకటి కాదని గమనించాలి.

**A. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సూచనగా ఉన్న బబులోను పట్టణమున్న స్థలం :** వాస్తవంగా ఈ పట్టణం ఉనికిలో ఉన్నదనడానికి సందేహం లేదు. మహాశ్రమల కాలంలో ఇది అన్ని పట్టణాల కన్న ప్రఖ్యాతి చెందుతుంది మరియు క్రీస్తు విరోధికి ప్రధాన కార్యాలయంగా ఉంటుంది. కొన్ని కారణాలను ఆధారం చేసికొని, కొంతమంది ప్రాచీన బబులోను యూఫ్రటీసునది ఒడ్డున పునర్నిర్మించబడుతుందని చెప్తారు.

**B. పట్టణము వర్ణన (ప్రక 18:2-24) :**

ఈ పట్టణము దయ్యాలకు, తప్పుడు (అసత్య) సిద్ధాంతాలకు ఉనికి పట్టుగా ఉంటుంది (18:2). భూరాజులు, భూలోక వర్తకులు దాని వలన ధనవంతులౌతారు (18:3). దాని పాపాలు ఆకాశాన్ని అంటుకొంటాయి (18:5). అది సుఖభోగాలను విలాసవంతమైన జీవితాన్ని కలిగి ఉంటుంది (18:7). దానికున్న ధన సమృద్ధిని బట్టి, దేవుని తీర్పును గుర్తించలేని అంధత్వంలో ఉంటుంది. ప్రపంచంలో అతి విలువైన 25 విలాస వస్తువులు ప్రక 18:11-17 లో పేర్కొనబడ్డాయి. అది తన మాయ మంత్రాల చేత జనములన్నిటిని మోసం చేసింది. (18:23). భూమి మీద వధించబడిన పరిశుద్ధులందరి రక్తంతో అది నింపబడి ఉన్నది (18:24).

**C. పట్టణ నాశనం (ప్రక 14:8) :**

బైబిలులో, యెరూషలేము తరువాత ఎక్కువ పర్యాయాలు, అనగా దాదాపు 260 సార్లు ప్రస్తావించబడిన పట్టణం ప్రాచీన బబులోను. మహాశ్రమల కాలంలో పునర్నిర్మించబడిన ఈ పట్టణ వైభవం, ప్రాచీన పట్టణానికి ఏ మాత్రం తీసిపోదని బైబిలు పండితుల అభిప్రాయం. ఈ పట్టణం ప్రపంచమంతటిపై ఆధిపత్యం వహించి నిరంకుశపాలన చేస్తుంది. ప్రపంచ స్టాక్ మార్కెట్ అంతా ఈ పట్టణముచే నియంత్రించబడుతుంది. ఈ పట్టణంలో జరిగేవన్నీ క్రీస్తు విరోధిని కేంద్రంగా చేసికొని దేవునికి వ్యతిరేకంగా జరిగించబడతాయి. ఈ మహాపట్టణం తీర్పుకు గురికానున్నదని ఎవ్వరూ ఊహించరు. సూర్యుడస్తమించేసరికి ఇది శిథిలాలుగా మిగిలిపోతుంది. ప్రపంచం ఈ వార్త విని నిశ్చేష్టులై ప్రలాపిస్తారు. దాని నాశనకర్త దేవుడే (18:8-20) దాని నాశనాన్ని గూర్చి భూలోక మరియు పరలోక ప్రతిస్పందనలు 18:19, 20లో వ్రాయబడ్డాయి.

**ఊ. హార్‌మెగిద్దోను వద్ద రక్తపాతం ద్వారా తీర్పు (ప్రక 19:1-9,21) :**

**A. పరలోకంలో విందు - వధువు యొక్క పరిచయం (19:1-10) :**

ఈ మహిమాన్విత ఉత్సవం, పరలోక పరిభాషయైన "హల్లెలూయ" అనే స్తుతి మాటతో జరిగించబడుతుంది. క్రొత్త నిబంధనలో మరెక్కడ వాడబడని ఈ మాటను పరిశుద్ధాత్మ ఈ సందర్భం కొరకే దాచి ఉంచాడు. (పాత నిబంధనలో ఈ మాట 24 సార్లు వ్రాయబడింది). మహావేశ్యపై గొఱ్ఱెపిల్ల విజయాన్ని బట్టి, మరియు ఆయన వివాహ సందర్భంగా ఈ ఉత్సవం జరుగుతుంది.

**B. భూలోకంలో విందు - యుద్ధమును గూర్చిన పరిచయం (19:11-21) :**

ఈ భూమ్మీద జరిగిన యుద్ధాలన్నిటికన్న ప్రాముఖ్యమైన హార్‌మెగిద్దోను యుద్ధాన్ని గూర్చి వివరించేందుకు పరిశుద్ధాత్మ దావీదు, యెషయా, యోవేలు, జెకర్యా ప్రవక్తలను మరియు అపొస్తలుడైన యోహానును వాడుకొన్నాడు (కీర్త 2:1-5,9; యెష 34:1-6; 63:3,4,6; యోవే 3:2,9-16; జె 12:2; 14:2,3,13; ప్రక 14:14-20; 16:16:19:11-21). ఇది ప్రపంచంలో కనీవిని యెరుగని యుద్ధం. ఈ యుద్ధంలో గమనించాల్సిన విషయాలు ఇవి.

1. హార్‌మెగిద్దోను యుద్ధం యెహెజ్కేలు 38వ అధ్యాయంలో వ్రాయబడిన, రష్యాదాడిలాంటిది కాదు. రష్యా, ఉత్తర దిక్కు నుండి దాడి చేస్తుంది. కాని ఈ యుద్ధంలో అన్ని దిక్కుల నుండి అన్ని దేశాలు యుద్ధానికి వస్తాయి. రష్యా ఇశ్రాయేలు సంపదలను దోచుకోడానికి దాడిచేస్తుంది, కాని ఈ యుద్ధం గొఱ్ఱెపిల్లను ఆయన ప్రజలను నాశనం చేయడానికి జరగుతుంది. దీనికి క్రీస్తు విరోధి నాయకత్వం వహిస్తాడు.

2. హార్‌మెగిద్దోను యుద్ధం బైబిలులో చివరి యుద్ధం కాదు. ఇది మహాశ్రమల కాలం చివరలో జరుగుతుంది. వెయ్యేండ్ల పాలన అనంతరం చివరి యుద్ధం జరుగుతుంది (20:7-9).

**3. యుద్ధరంగం :** హార్‌మెగిద్దోను యుద్ధ భూమి, ఉత్తరాన మెగిద్దో నుండి (జెక 12:11; ప్రక 16:16) దక్షిణాన ఏదోము వరకు (దరిదాపు 200 మైళ్ళు) (యెష 34:5,6; 63:1) పశ్చిమదిశన మధ్యధరా సముద్రము నుండి తూర్పునమోయాబు కొండల వరకు (దరిదాపు 100 మైళ్ళు) వ్యాపించి ఉంటుంది (జెక 14::1,2). ఈ భూభాగంలో 4000 లక్షల మంది ప్రజలు నలుదిక్కుల దేశాల రాజులు గుమికూడతారు (యోవే 3:14). అప్పుడు సర్వాధికారియైన దేవుని తీక్షణమైన ఉగ్రత అనే మద్యపు తొట్టి త్రొక్కబడుతుంది. (19:15).

ఎ) ఈ హార్‌మెగిద్దోను యుద్ధ భూమిలో యెహోషాపాతు లోయ (యోవే 3:2,12) ఎస్ట్రాయేలోను లోయ; మెగిద్దో (జెక 12:11) బొస్రా (యెష 34:6; 63:1) మొదలైన ముఖ్య స్థలాలున్నాయి.

బి) ఈ ప్రాంతంలో పాత నిబంధన కాలంలో పలుయుద్ధాలు జరిగాయి.

దెబోరా మరియు బారాకు కనానీయులను ఓడించుట (న్యాయా 4,5), గిద్యోను మిద్యానీయులను ఓడించుట (న్యాయా 7 అధ్యా), ఫిలిష్తీయులు సౌలును ఓడించి చంపుట (**I** సమూ 31 అధ్యా) దావీదు గొల్యాతును చంపుట (**I** సమూ 17 అధ్యా) ఐగుప్తు రాజు యోషీయాను చంపుట (**II** రాజు 23 అధ్యా).

ఈ యుద్ధంలో పాలస్తీన రక్తంతో తడుపబడుతుంది. ఈ యుద్ధంలోని రక్తపాతం హార్‌మెగిద్దోను నుండి యెహోషాపాతులోయ గుండా, ఏదోము దేశము మీదుగా యూదయ మరియు యెరూషలేము పట్టణంలోనికి పారుతుంది. యేసు ఈ లోకాన్ని పరిపాలించకుండ చేయాలని, దేవుని ప్రజల్ని నాశనం చేయాలని సాతాను పన్నిన పన్నాగాలకు తోడ్పడిన వారందరి రక్తనాళాల గుండా పారిన ఈ రక్తపు కాలువలు మానవుల ఊహకు అందనివి. హార్‌మెగిద్దోను యుద్ధంలో క్రూరమృగం యొక్క పటాలమంతా హతమార్చబడుతుంది. క్రీస్తు ఆగమన ప్రకాశం, వాని సైన్యాన్ని భయకంపితుల్ని చేస్తుంది (జెక 12:2; 14:13). గొప్పకల్లోలమును పుట్టిస్తుంది. క్రీస్తు విరోధి నాశనం చేయబడతాడు (I థెస్స 2:8). ఆయన ఆగమన ప్రకాశం జంతువులకు అంధత్వాన్ని, మనుష్యులకు మతి భ్రమణం కలిగిస్తుంది (జె 12:4). ఈ లోకసైన్యాలన్నీ తెగులుతో తుడిచివేయబడతాయి (జెక 14:12,15). మనుష్యుల మరియు జంతువుల రక్తం 200 మైళ్ళు కాలువలా పారుతుంది. కుళ్ళిపోయిన ఈ రక్తమాంసాల దుర్వాసన ఆ ప్రాంతమంతా వ్యాపిస్తుంది. (యెష 34:1-3). ఈ కళేబరాలు ఆకాశపక్షులకు విందుగా ఉంటాయి (ప్రక 19:17,18,21). క్రూరమృగం మరియు అబద్ద ప్రవక్త అగ్ని గుండంలో వేయబడతారు (ప్రక 19:20).

4. **యుద్ధానికి కారణం :** ఈ ఘోరయుద్ధం కొరకు ప్రపంచ దేశాలన్నీ ఆయా కారణాలను బట్టి వాటికవే పురికొల్పబడి హార్‌మెగిద్దోను వద్ద సమకూడుతాయి. ముఖ్యంగా మూడు కారణాలను బట్టి సమకూడుతాయి.

ఎ) దేవుడు తన సార్వభౌమాధికారాన్ని బట్టి ఆయనే దేశాలను సమకూరుస్తాడు (యెష 34:2; యోవే 3:2 జెక 14:2; ప్రక 16:16).

బి) సాతాను మోసం చేత వారిని సమకూరుస్తాడు (ప్రక 16:13).

సి) క్రీస్తు పట్ల దేశాలకున్న ద్వేషాన్ని బట్టి సమకూడుతాయి. (కీర్త 2:1-3; ప్రక 11:18)

5. **యుద్ధం జరిగే క్రమము :**

ఎ) యూఫ్రటీసు నది ఎండి పోవడం వలన (ప్రక 16:12) చైనా, భారతదేశం మరియు ఆసియాలోని ఇతర బలగాలు నేరుగా హార్‌మెగిద్దోనులోనికి ప్రవేశిస్తాయి.

బి) యెరూషలేము (47వ సారి అనగా చివరిసారిగా) నాశనం చేయబడుతుంది (జె 12:2; 14:2; లూకా 1:20). మహా శ్రమల కాలంలోని అత్యంత విషాద సంఘటన ఇది.

**ఎ. క్రీస్తు విరోధి మరియు అబద్ధ ప్రవక్త నాశనం చేయబడుట ద్వారా తీర్పు (19:20) :**

# నాల్గవ భాగం

**IV. గొఱ్ఱె పిల్ల రాజ్యస్థాపన (20 అధ్యా)**

**A. పెద్ద సంకెళ్ళు : 20:1-3**

**B. గొప్ప పునరుత్థానం : 20:6**

1. క్రీస్తు పునరుత్థానం (I కొరి 15:23)
2. సంఘం ఎత్తబడినపుడు జరిగే విశ్వాసుల పునరుత్థానం (I థెస్స 4:16; I కొరి 15:51-53).
3. పాత నిబంధన కాలపు, మహా శ్రమల కాలపు పరిశుద్ధుల పునరుత్థానం (20:6) దీని గూర్చి పలు వాక్యాధారాలు ఉన్నాయి. (యోబు 19:25,26; కీర్త 49:15; యెష 25:8; 26:19 దాని 12:2; హోషే 13:14; యోహా 5:28,29; హెబ్రీ 11:35).
4. అవిశ్వాసుల పునరుత్థానం (ప్రక 20:5, 11-14).

**C. గొప్ప పరిపాలన (20:4,6) :**

**1. వెయ్యేండ్ల పాలనను గూర్చిన వాస్తవం (20:4) :** ప్రకటన 20:1-7 వచనాలలో యోహాను కనీసం 6 సార్లు వెయ్యేండ్ల పాలనను గూర్చి ప్రస్తావించాడు. I పేతురు 3:8 లో వ్రాయబడిన దానిని బట్టి ఈ కాలం ఖచ్చితంగా వెయ్యేండ్లు ఉంటుందని చెప్పలేమని కొంతమంది అభిప్రాయం. వారే, సృష్టి ఆరు దినాలను వేలాది సంవత్సరాలుగా పరిగణించడం ఆశ్చర్యం.

**D. గొప్ప తిరుగుబాటు (20:7-10) :**

సాతాను అగ్నిగుండంలోనికి త్రోసివేయబడుట. అదే వాని శాశ్వత గమ్యం.

**E. గొప్ప సింహాసనం (20:11-15) :**

ఈ సింహాసనం వాస్తవమైనది (హెబ్రీ 9:27; దాని 7:9,10). దీనిపై క్రీస్తు తానే న్యాయాధిపతిగా కూర్చుంటాడు (యోహా 5:22, 27; అపొ. 10:40,42; II తిమో 4:1). ఈ సింహాసనం వద్ద మనస్సాక్షిని బట్టి (రోమా 2:15) పలికిన మాటలను బట్టి (మత్త 12:36,37) జీవ గ్రంథమును బట్టి (నిర్గ 32:32,33; కీర్త 69:28; దాని 12:1; ఫిలి 4:3; ప్రక 3:5; 13:8; 17:8; 20:12,15; 21:27; 22:19) తీర్పు తీర్చబడుతుంది. మానవుల రహస్యాలు విమర్శించబడతాయి (రోమా 2:16; ప్రస 12:14). ఈ సింహాసనం వద్ద నిలిచే ముద్దాయిలు అవిశ్వాసులు మాత్రమే (కీర్త 9:17). వారికివ్వబడిన తీర్పు నిత్యాగ్ని గుండం (ప్రక 20:14,15; మత్త 25:41,46).

# ఐదవ భాగం

**A. గొఱ్ఱె పిల్ల భార్య పరిచయం చేయబడుట**

1. **ఆమె నివాసం 21:1–22:5 :** ఈ భాగంలో మొదటి ఆకాశము మొదటి భూమి గతించిపోవడం, పరిశుద్ధ యెరూషలేము పట్టణం పెండ్లి కుమార్తెవలె సిద్ధపడి దిగి వచ్చుటను గూర్చి వ్రాయబడింది. పాత భూమ్యాకాశాలు నాశనం చేయబడతాయని పలు లేఖనాలు ధృవీకరిస్తున్నాయి (మత్త 24:35; హెబ్రీ 1:10–12; **II** పేతు 3:10,11). దేవుని శుద్ధీకరణలో ఒక భాగముగా ఇది జరుగుతుంది.

2. **ఈ పట్టణ నివాసులు :** తండ్రియైన దేవుడు (4:2,3; 5:1–7), కుమారుడు (5:6)న పరిశుద్ధాత్మ (14:13; 22:17), పరిశుద్ధ దూతలు (5:11), ఇరువది నలుగురు పెద్దలు (ప్రక 4:4,10,11), రక్షించబడిన ఇశ్రాయేలీయులు (హెబ్రీ 11:16; మత్త 25:10,23; ప్రక 14:1–3; 15:1–3), సంఘము (హెబ్రీ 12:22,23; ప్రక 19:1,7,8; 21:1,9–11) మరియు అన్ని కాలాలలో విమోచించబడిన భూనివాసులు (ప్రక 5:9; 7:9,10). అయితే ప్రక 21:8,27; 22:15 లో పేర్కొనబడిన వారు అందులో ప్రవేశింపరు. మహిమాన్వితమైన ఈ పట్టణపు వర్ణన 21:10–26లో చూడవచ్చును.

**B. ఆమె భర్త – నమ్మకమైన రక్షకుడు (22:6–21) :**

ఆయన తప్పకుండా వస్తాడని (22:6) త్వరగా వస్తాడని (22:7) ఆయన పట్ల నమ్మకంగా ఉన్నవారికి ప్రతిఫలమిస్తాడని వాగ్దానం చేసాడు (22:12).

ప్రక 22:10 లో ఆయన ఇచ్చిన ఆజ్ఞ 22:13,16 లో ఆయనను గూర్చిన స్వయం వర్ణన; 22:17లో ఆయన ఆహ్వానం మరియు 22:18,19లో ఆయన హెచ్చరిక ఉన్నది.

ఈ సంగతులన్నీ చూచి సాక్ష్యమిచ్చువాడు ఆయన త్వరగా వస్తున్నాడని చెప్తూ, **"ప్రభువైన యేసూ రమ్ము"** అని ఆయనను ఆహ్వానిస్తున్నాడు (22:20). ఈ పుస్తకం చదివిన నీవు యోహానుతో కలిసి ప్రభువైన యేసూ రమ్ము అని చెప్పగలవా?

అట్టి కృప ప్రభువు మీకు దయచేయును గాక!

---

**TTB - Telugu - Study Outlines - Book of Revelation**
Printed by : Premadhara, Trans World Radio - India
12-1-334/17/3, Lalapet, Secunderabad - 500 017
Ph : 040-27003011

**FREE** MP3 DOWN LOAD - Log on to :
**www.radio882.com**